క్లుప్తంగా

తండాలోని సమస్యలు పరిష్కరించండి



చెన్నారావుపేట : మండలంలోని కాల్‌నాయక్ తండాలో నెలకొన్న సీసీ రోడ్లు, ఇతర సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూక్యా గోపాల్‌నాయక్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు వివరించింది. అనంతరం గోపాల్‌నాయక్ మాట్లాడారు. సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గోవింద్ నాయక్, నాయకులు తిరుపతినాయక్, భద్రు, నర్సింహ, రాములు తదితరులు పాల్గొన్నారు.

‘అరుణోదయ’ రాష్ట్ర కమిటీకి అజయ్ ఎన్నిక

నర్సంపేట : అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర కమిటీకి నర్సంపేటకు చెందిన గుర్రం అజయ్ ఎన్నికయ్యారు. సూర్యాపేటలో జరిగిన మహాసభలో రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్న సందర్భంగా అజయ్‌ను కమిటీలోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకుడిగా అజయ్ మీడియాతో శుక్రవారం మాట్లాడారు. ప్రజలను చైతన్యవంతం చేయడమే లక్ష్యంగా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రదర్శనలు ఇస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని విష సంస్కృతులకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్మిస్తామని చెప్పారు.

సన్మానం



పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన ఆర్య వైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, ఐనవోలు ఆలయ కమిటీ డైరెక్టర్ దారం పూర్ణచందర్‌ను జిల్లా ఆర్యవైశ్య సంఘం బాధ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్ మాట్లాడారు. ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గార్లపాటి నాగేంద్ర బాబు, గందె శ్రీనివాస్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణకు అభినందన



సంగెం : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణను పద్మశ్రీ పురస్కారం అందుకున్న సందర్భంగా స్థానిక సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు గుండేటి బాబు శుక్రవారం అభినందించారు. తొలుత కృష్ణను బాబు మర్యాదపూర్వకంగా కలుసుకుని పూల బొకే అందజేశారు. అనంతరం శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆర్థికసాయం



దుగ్గొండి : మండలంలోని దేశాయిపల్లి గ్రామ రాజరాజేశ్వరస్వామి పురుషుల పొదుపు సంఘం సభ్యుడు కోట మల్లయ్య కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా అతడి సతీమణి పద్మకు పొదుపు సంఘాల సమితి అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్ సామూహిక బీమా కింద రూ.70 వేల సాయం శుక్రవారం అందజేశారు. తొలుత ఉస్మాన్, సమితి సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కందికొండ రవీందర్, ఉపాధ్యక్షుడు తుత్తూరు రవీందర్, పాలకవర్గ సభ్యులు లింగమూర్తి, పిండి రఘు, బుట్టి రాజు, బూస రమేశ్, కాటబత్తిని ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మైలారంలో..



రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గూడెల్లి వెంకన్న అనారోగ్యంతో బాధపడుతుండగా అతనికి వైద్యం కోసం బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం రూ.5 వేల సాయం అందజేశారు. అనంతరం మొరిపిరాలకు ఆ పార్టీ నాయకుడు పొరుపల్లి సుధాకర్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయన్ను శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. అలాగే గ్రామానికి చెందిన కోల కమలమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు.

క్షయ నిర్మూలనే లక్ష్యం

- వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ప్రత్యేక సర్వే
- వ్యాప్తి నిరోధానికి వైద్యారోగ్యశాఖ కృషి



పీహెచ్‌సీలో వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

నెక్కొండ : దేశవ్యాప్తంగా క్షయను నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. ఈ క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. క్షయ పీడితులను గుర్తించి వ్యాప్తిని నివారించే దిశగా చర్యలు చేపట్టింది. వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు గతేడాది డిసెంబర్ 7 నుంచి జిల్లాలో ప్రారంభమైన సర్వే మార్చి 17 వరకు కొనసాగనుంది.

1,481 మంది వ్యాధిగ్రస్తుల గుర్తింపు...

క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు గ్రామాలు, పట్టణాల్లో శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇంటింటా ఆశావర్కర్లతో సర్వే చేయిస్తున్నారు. క్షయ అంటువ్యాధి కావడంతో ఒకరి నుంచి మరొకరికి సోకకుండా కట్టడి చేసేలా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. 2024లో జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీ, సబ్‌సెంటర్ల వారీగా ఆక్టివ్ కేస్ ఫైండింగ్ క్యాంపులు నిర్వహించారు. 84 శిబిరాల్లో 17,825 మందికి టీబీ పరీక్షలు చేసి 1,481 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించారు.

వ్యాధి లక్షణాలు...

టీబీ (ట్యుబర్‌క్యులోసిస్)తో ఏటా పలువురు ప్రాణం కోల్పోతున్నారు. ఈ వ్యాధి మైకోబ్యాక్టీరియం ట్యుబర్‌క్యులోసిస్ అనే బ్యాక్టీరియాతో వ్యాపిస్తుంది. ప్రధానంగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతుంది. తర్వాత మెదడు, మూత్రపిండాలు, వెన్నెముక వంటి ఇతర భాగాలకు వ్యాపిస్తుంది. తెమడ లేదా పొడి దగ్గు, సాయంత్రం వేళ తీవ్రమైన జ్వరం, తలనొప్పి వస్తాయి. క్రమేణా బరువు తగ్గిపోవడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. వ్యాధికి తగిన చికిత్స చేయించకపోతే ప్రాణాలకే ప్రమాదం. ప్రతి లక్ష మందిలో 300 మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారని అంచనా..

అనుమానితుల గుర్తింపునకు సర్వే...

క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రభుత్వం ఆశ వర్కర్ల ద్వారా ఇంటింటి సర్వే చేపట్టింది. దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతినొప్పి, రక్తం పడడం వంటి లక్షణాలు ఉన్న వారికి పరీక్షలు నిర్వహిస్తున్నారు. వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందిస్తున్నారు.

ముందస్తు జాగ్రత్తలతో చెక్..



ముందస్తు జాగ్రత్తలతో క్షయను నివారించొచ్చు. తరచూ జ్వరం రావడం, బరువు తగ్గడం. ఆకలి లేకపోవడం లాంటి సమస్యలుంటే వైద్యులను సంప్రదించాలి. బీపీ, షుగర్, ఆస్తమా బాధితులు జాగ్రత్తగా ఉండాలి. వ్యాధి సోకినా ఉచితంగా మందులు ఇస్తున్నాం. క్రమం తప్పకుండా వాడాలి. జిల్లాలో గతేడాది 1,481 మందిని గుర్తించాం.

- గుగులోత్ మోహన్‌సింగ్, ప్రోగ్రాం అధికారి

స్వచ్ఛమైన నీటితోనే ఆరోగ్యం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సంగెం : స్వచ్ఛమైన నీరు తాగితేనే ఆరోగ్యంగా ఉంటామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని తీగరాజుపల్లిలో బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కలుషిత నీరు తాగితే అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని చెప్పారు. బాలవికాస స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించేలా గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ప్రజలు వాటర్ ప్లాంట్‌ను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, అధికార ప్రతినిధి జనగాం రమేశ్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నర్సింహనాయక్, నాగరాజు, నాయకులు మెట్టుపల్లి రమేశ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం.. నిందితుడి అరెస్ట్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమణమూర్తి

నర్సంపేట రూరల్ : వాహనాల తనిఖీ సందర్భంగా 3.450 కేజీల గంజాయి స్వాధీనం చేసుకోవడంతోపాటు ఒకరిని అరెస్ట్ చేశామని, మరొకరు పరారీలో ఉన్నారని టౌన్ సీఐ రమణమూర్తి తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడారు. పట్టణంలోని పాకాల రోడ్డులోని ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న పట్టణానికి చెందిన హరిప్రసాద్, జక్కుల అజయ్ వాహనాన్ని వదిలి పారిపోతుండగా హరిప్రసాద్‌ను ఎస్సై అరుణ్ అదుపులోకి తీసుకుని గంజాయితోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా అజయ్ పారిపోయాడు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.87 వేలు ఉంటుందని సీఐ తెలిపారు. ఇద్దరిపైనా కేసు నమోదు చేశామన్నారు. గంజాయి విక్రేతలపై, చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

నర్సంపేట : పట్టణంలోని శ్రీభూనీలా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం శంకుస్థాపన చేశారు. అర్చకులు ముడుంబై వంశస్తులు కృష్ణమాచార్యులు, వెంకటాచార్యులు, మాధవచార్యులు, రామానుజచార్యులు కళశాభిషేకం, పాలు, పెరుగు, నెయ్యి, చక్రకనక అభిషేకాలు నిర్వహించారు. పూర్వ గర్భగుడి ఎదుట తొమ్మిది ఫీట్ల భూగర్భంలో తాంత్రిక పూజ విధానంలో వెండి ప్లేటు, పలు యంత్రాలతో భూసమర్పణ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కృషితో ప్రభుత్వం నిధులు కేటాయించగా దాతలు ఒక్కరోజు వ్యవధిలో రూ.10 లక్షలు అందించగా సుమారు రూ.3 కోట్ల అంచనా వ్యయంతో ఆలయ పునర్నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు దుబ్బ రమేశ్, వేమిశెట్టి శ్రీనివాస్, వీరమనేని వెంకటేశ్వర్ రావు, బండారి దామోదర్, శింగిరికొండ రవీందర్, చింతల నిరంజన్, రామగోని సుధాకర్, బాల్నె సర్వేశం, రేమిడి కట్టయ్య, తక్కళ్లపల్లి రవీందర్ రావు, పాలాయి శ్రీనివాస్, ఎర్ర యాకూబ్‌రెడ్డి, వేముల సాంబయ్య, నల్ల మనోహర్‌రెడ్డి, గోగుల రాణాప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి సస్పెన్షన్



రాయపర్తి : బీఆర్‌ఎస్ నుంచి బిల్లా సుధీర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్ తెలిపారు. మండలంలోని దుబ్బతండాలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకే అతడిని సస్పెండ్ చేస్తున్నట్లు చెప్పారు. సుధీర్ రెడ్డికి బీఆర్‌ఎస్ పార్టీకి ఇప్పటి నుంచి సంబంధం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, లేతాకుల రంగారెడ్డి, మధుకర్‌రెడ్డి, చిన్నాల రాజబాబు, గజవెల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

పార్టీ మారుతానని చెప్పా..

తాను బీఆర్‌ఎస్ పార్టీ మారుతానని చెప్పానని బిల్లా సుధీర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ నుంచి సస్పెండ్ చేసినా భయపడేది లేదని, తాను ఏ పార్టీలోకి వెళ్లేది తర్వాత చెబుతానన్నారు.

వృత్తి పన్ను జీఓను రద్దు చేయాలి



ఆర్‌ఐ సంపత్‌కుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజులకు వినతిపత్రం ఇస్తున్న యువరాజు, కార్మికులు

- బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యువరాజు

నర్సంపేట : మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులకు వృత్తి పన్ను రద్దు చేయాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (బీఆర్‌టీయూ అనుబంధం) ఆధ్వర్యంలో మున్సిపల్ ఆర్‌ఐ సంపత్‌కుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యువరాజు మాట్లాడారు. కేవలం రూ.15–20 వేల వేతనం తీసుకుంటున్న కార్మికులపై వృత్తి పన్ను భారంగా మారిందన్నారు. వృత్తి పన్ను వసూలు కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓను తక్షణమే రద్దు చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు తప్పవని చెప్పారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు గడ్డం సమ్మయ్య, నాయకులు మహేందర్, అలువాల రాజు, మాదాసి ప్రవీణ్, పుట్టపాక రవీందర్, కొల్లూరి రంజిత్, గౌతం, పుష్ప, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

వర్ధన్నపేట : ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఇల్లందలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై చందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన యాకనాథం (38) చేపలు అమ్ముతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. మూడేళ్ల క్రితం యాకనాథంకు వివాహం జరగ్గా ఒక కుమారుడు కలిగాడు. ఇంట్లో తరచూ గొడవలు జరుగుతుండడంతో యాకనాథం భార్య కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లింది. కాగా శుక్రవారం తెల్లవారుజామున యాకనాథం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పాల ప్యాకెట్ కోసం బయటకు వెళ్లి వచ్చిన అతడి దుర్గయ్య గమనించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని తీవ్ర గాయాలు

గీసుకొండ : ట్రాక్టర్ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని మంగళితండాలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన కేలోతు విద్వేశ్వర్ వాటర్ క్యాన్‌తో బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విద్వేశ్వర్ ఎడమ కాలి పాదం కింది భాగం తెగిపోయింది. తీవ్ర రక్తం అవుతుండడంతో స్థానికులు వెంటనే వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు సందర్శించి విచారణ చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో..

వర్ధన్నపేట : మండలంలోని తండారిపల్లికి చెందిన మంద రాకేశ్ దమ్మన్నపేట శివారులో అతడి ద్విచక్ర వాహనం కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి కింద పడడంతో గాయాలపాలయ్యాడు. అదే సమయంలో ఆ రోడ్డు మీదుగా ప్రయాణిస్తున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రమాదాన్ని గమనించి రాకేశ్‌ను తన వాహనంలో ఆస్పత్రికి తరలించారు. రాకేశ్‌కు స్వల్ప గాయలయ్యాయని, ప్రాణాపాయం లేదని తెలిసింది.

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిక

రాయపర్తి : మండలంలోని రావులతండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు భూక్యా యాకూబ్, లకావత్ రవి, నేతావత్ సందీప్, వీరూ, శ్రీను, సీమా, రవి, చందర్, మొగిలి, మోహన్ బీఆర్‌ఎస్‌లో చేరారు. మండలంలోని మైలారంలోని తన నివాసంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి వారికి శుక్రవారం కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. పార్టీ శ్రేణుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోశ్‌గౌడ్, నాయకులు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, లేతాకుల రంగారెడ్డి, లేతాకుల మధూకర్‌రెడ్డి, బిల్లా వెంకట్‌రెడ్డి, లేతాకుల సుధాకర్‌రెడ్డి, నేతావత్ కిషన్, గుగులోతు రవి, శ్రీధర్, మన్సూర్, సంతోశ్, రవి, సుమన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మట్కా శిబిరంపై టాస్క్‌ఫోర్స్ దాడులు



మట్కా శిబిరంలో పట్టుకున్న నగదు, సెల్‌ఫోన్లను చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బంది

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ నగరం 16వ డివిజన్ హోల్‌సేల్ కాంప్లెక్స్ సమీపంలోని లారీ అడ్డాలో కొందరు మట్కా ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. దాడుల్లో రూ.22,435 నగదు, 18 మొబైల్ ఫోన్లు, మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ జి.బాబూలాల్ తెలిపారు. మట్కా ఆడుతున్న గాడిపల్లి యశ్వంత్ (చింతనెక్కొండ), ఎస్‌డీ ఖాజామియా (పుప్పాలగుట్ట), ఆరెపల్లి పీటర్ (ఓసిటీ), ఎండీ అఫ్జల్ (లేబర్‌కాలనీ), ఎస్‌డీ.జమీర్ (పుప్పాలగుట్ట), ఆరెపల్లి రాజేశ్ (ఓసిటీ), ఎండీ జబ్బర్‌ఖాన్ (చింతల్), నెల్లూరి రాంబాబు (విశ్వనాథపురం), ఎండీ మజ్జిద్ (బాలాజీనగర్), ఎండీ అఫ్జల్ హుస్సేన్(ఎల్‌బీ నగర్), చింతం మల్లయ్య (మచ్చాపూర్), ఎస్‌కే వాసీం (చింతల్), ఎండీ అసనత్ (చింతల్), ఆరెల్లి విల్సన్ (కాశిబుగ్గ), ఎండీ హాది(చింతల్), ఎస్‌కే అజర్(కాశిబుగ్గ), సయ్యద్ కలీం(పోచమ్మమైదాన్), అడుప అజయ్‌కుమార్ (పెరుకవాడ)ను అదుపులోకి తీసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం గీసుకొండ పోలీసులకు అప్పగించినట్లు సీఐ పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

సంగెం: మండలంలోని పల్లార్‌గూడ గ్రామ శివారులో పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. పేకాడుతున్న ఇరుపుల స్వామి, బత్తుల రమేశ్, సంగరబోయిన కృష్ణ, రాయపురం రమేశ్, పల్లంకొండ రమేశ్, పాలకుర్తి సారంగపాణి నుంచి రూ.14,540 నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం వారిని సంగెం పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ ఎం.రంజిత్‌కుమార్ తెలిపారు. దాడుల్లో ఎస్సై వి.దిలీప్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

‘రైతుభరోసా’ విడుదలలో ఆంక్షలు సరికాదు

నల్లబెల్లి : రైతుభరోసా డబ్బు విత్‌డ్రా చేసుకోవడంలో రైతులకు బ్యాంకర్లు ఆంక్షలు విధించడం సరికాదని ప్రజాసంఘాల నాయకులు బట్టు సాంబయ్య, బొట్ల నరేశ్ అన్నారు. రైతులను ఇబ్బంది పెడుతున్న బ్యాంకు ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ కృష్ణకు శుక్రవారం వినతి పత్రం అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు పరికి రత్నం, అనిల్, దయాకర్, సురేశ్, కృష్ణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పర్వతగిరి : మండల కేంద్రానికి చెందిన పుల్లూరి ఎల్లమ్మ, కాంగ్రెస్ కార్యకర్త చిదురు కట్టయ్య, చెరువుకొమ్ముతండాకు చెందిన లాల్య, వాంకుడోతు తిమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే నాగరాజు పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రావు, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భానోతు భాస్కర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణే ధ్యేయం



నల్లబెల్లి : అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ఆచార్య



ఖానాపురం : మాట్లాడుతున్న డాక్టర్ జ్యోతి

- ఎంపీడీఓ నర్సింహమూర్తి

నల్లబెల్లి : నులి పురుగుల నిర్మూలనే ధ్యేయంగా ప్రభుత్వం అల్బెండాజోల్ పంపిణీ కార్యక్రమం చేపట్టిందని ఎంపీడీఓ నర్సింహమూర్తి తెలిపారు. జాతీయ నులి పురుగుల నిర్మూలనా దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. 19 ఏళ్లలోపు వయస్సున్న బాలలందరికీ ఈనెల 10న అల్బెండాజోల్ మాత్రలు వేయాలని చెప్పారు. మూడేళ్లలోపు చిన్నారులకు సగం మాత్ర వేయాలని సూచించారు. మాత్ర వేసుకున్న బాలలకు ఏవైనా ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే స్థానిక వైద్యాధికారి దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. అనంతరం నల్లబెల్లి, మేడపల్లి వైద్యాధికారులు ఆచార్య, జ్యోతి మాట్లాడారు. నులి పురుగులతో బాలలు రక్తహీనత, ఇతర సమస్యలు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. సమావేశంలో ఎంఈఓ వసంత, ఐసీడీఎస్ నల్లబెల్లి క్లస్టర్ సూపర్‌వైజర్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి

దుగ్గొండి : బాలల్లో నులి పురుగుల నివారణ కోసం ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది సమన్వయంతో పని చేయాలని ఎంపీడీఓ లెక్కల అరుంధతి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య, విద్యాశాఖ అధికారులు, సిబ్బందితో గ్రామాల వారీగా పిల్లల, అందించాల్సిన ఆల్బెండాజోల్ మాత్రల వివరాలపై ఆమె సమీక్షించారు. ఈనెల 10న అన్ని పాఠశాలల్లో బాలలకు మాత్రలు తప్పనిసరిగా వేయాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కిరణ్‌రాజ్, విజయ్‌కుమార్, భరత్, పృథ్వీరాజ్, రాకేశ్, హుస్సేన్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

నట్టలతో పోషకాహార లోపం, రక్తహీనత

ఖానాపురం : కడుపులో నట్టలు ఉండడం వల్ల బాలల్లో పోషకాహార లోపం, రక్తహీనత తలెత్తే ప్రమాదం ఉందని వైద్యులు అరుణ్‌కుమార్, జ్యోతి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన మండలస్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 10న మండలవ్యాప్తంగా అల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ రాజారాణి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సునీల్‌కుమార్‌రాజ్, ఎంఈఓ శ్రీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాసంతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజయ్య, ఫార్మాసిస్ట్ శ్రీనివాసచారి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆంగ్లంలో నైపుణ్యం తప్పనిసరి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నవీన్



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నవీన్

నర్సంపేట : విద్యార్థులకు ఆంగ్ల భాషలో నైపుణ్యం తప్పనిసరి అని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నవీన్ తెలిపారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యవేక్షణలో ఉస్మానియా యూనివర్సిటీలో జరిగిన ఇంపార్టింగ్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్ ఫర్ తెలంగాణలో నెల రోజుల రెసిడెన్షియల్ కోర్సు ముగించుకొని వచ్చిన కళాశాల విద్యార్థులు గౌతమ్, అనసూయలను శుక్రవారం ప్రిన్సిపాల్ నవీన్ అభినందించి మాట్లాడారు. ఇంగ్లీష్ విశ్వభాషగా మారిందని చెప్పారు. ఆంగ్లంలో నైపుణ్యం సాధిస్తేనే మెరుగైన ఉపాధి అవకాశాలు పొందే పరిస్థితి నెలకొందని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌కేసీ కోఆర్డినేటర్, ఆంగ్ల విభాగాధిపతి రహీముద్దీన్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి సత్యనారాయణ, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కంధాల సత్యనారాయణ, పరీక్షల నియంత్రణాధికారి కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్సంపేట/నల్లబెల్లి : నర్సంపేట, నల్లబెల్లి మండలంలోని నల్లబెల్లి, నందిగామ, రంగాపురం సబ్‌స్టేషన్ల పరిధిలో నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తనుందని విద్యుత్ శాఖ ఏఈలు ఎస్.విజయభాస్కరరావు, హరిప్రసాద్ శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా నర్సంపేట పట్టణంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, నల్లబెల్లి మండలంలోని సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వివరించారు. ప్రజలు, రైతులు విద్యుత్ అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు.